# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

శనివారం / 10.02.2024


## అందుబాటులోకి మరో 100 కొత్త బస్సులు

**తెలంగాణ వీణ ,హైదరాబాద్ :** మహాలక్ష్మి పథకం అమలు వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ఏడాది జూన్ నాటికి 1325 బస్సులను దశలవారీగా వాడకంలోకి తెచ్చేలా ప్లాన్ చేసింది. అందులో 712 పల్లె వెలుగు, 400 ఎక్స్ ప్రెస్, 75 డీలక్స్, 138 లహరి/రాజధాని బస్సులున్నాయి. వాటిలో ఇప్పటికే కొన్ని బస్సులను వాడకంలోకి తెచ్చిన సంస్థ.. తాజాగా మరో 100 బస్సులను ప్రారంభించబోతుంది. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి గారు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారితో పాటు టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొంటారు. కొత్తగా అందుబాటులోకి వస్తోన్న ఈ 100 బస్సుల్లో.. 90 ఎక్స్ ప్రెస్ బస్సులున్నాయి. ఇవి మహాలక్ష్మి-ఉచిత బస్సు ప్రయాణ స్కీంకు ఉపయోగపడనున్నాయి. అలాగే, శ్రీశైలం ఘాట్ రోడ్డుకు అనుగుణంగా నడిచే 10 ఏసీ రాజధాని బస్సులను తొలిసారిగా సంస్థ ప్రవేశపెడుతోంది. 11 మీటర్ల పొడువుగల ఈ ఏసీ బస్సుల్లో.. 36 సీట్ల సామర్థ్యం ఉంటుంది. శ్రీశైలానికి వెళ్లే భక్తులు సంస్థ అధికారిక వెబ్ సైట్ wwww.tsrtconline.in ద్వారా సీట్లను ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు.

# అసెంబ్లీలో 'ఓట్ ఆన్ అకౌంట్'
# బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క

- 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రూ. 2,75,891కోట్లు
- ఆరు గ్యారెంటీల కోసం రూ. 53,196 కోట్లు అంచనా
- పరిశ్రమల శాఖ రూ. 2,543 కోట్లు
- ఐటి శాఖకు రూ. 7,74కోట్లు.
- పంచాయతీ రాజ్ రూ. 40,080 కోట్లు
- పురపాలక శాఖకు రూ. 11,692 కోట్లు
- మూసీ రివర్ ఫ్రాంట్ కు వెయ్యి కోట్లు
- వ్యవసాయ శాఖ రూ. 19,746 కోట్లు
- ఎస్సి, ఎస్టీ గురుకుల భవన నిర్మాణాల కోసం రూ. 1,250కోట్లు
- ఎస్సి సంక్షేమం రూ. 21, 874 కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ. 13,013 కోట్లు
- మైనార్టీ సంక్షేమం రూ. 2,262 కోట్లు
- బీసీ సంక్షేమం, బీసీ గురుకుల భవనాల నిర్మాణం కోసం రూ. 1,546 కోట్లు.
- బీసీ సంక్షేమం రూ. 8 వేల కోట్లు
- విద్యా రంగానికి రూ. 21,389కోట్లు.
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ. 5,00 కోట్లు.
- యూనివర్సిటీల్లో సదుపాయాలకు రూ. 5,00 కోట్లు
- వైద్య రంగానికి రూ. 11,500 కోట్లు
- విద్యుత్ – గృహ జ్యోతికి రూ. 2,418కోట్లు.
- విద్యుత్ సంస్థలకు రూ. 1,6825 కోట్లు.
- గృహ నిర్మాణానికి రూ. 7,740 కోట్లు.
- నీటి పారుదల శాఖకు రూ. 28,024 కోట్లు




**తెలంగాణవీణ,హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ. 2లక్షల 75వేల 891 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. మూలధన వ్యయం రూ. 29,669కోట్లు కాగా రెవెన్యూ వ్యయం రూ. 2,01,178 కోట్లుగా వెల్లడించారు. ద్రవ్యలోటు రూ.33,786 కోట్లు ఉండగా.. రెవెన్యూఖాతాలో మిగులు రూ.9,031 కోట్లు ఉన్నట్లు ప్రకటించారు. మూలధన వ్యయం రూ.24,178 కోట్లు ఉన్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను సవరించిన అంచనాలు రూ.2,24, 625 కోట్లుగా పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఆరు గ్యారెంటీలకు పెద్దపీట వేశామన్నారు.సామాజిక న్యాయం చేసి చూపిస్తామన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10లక్షలకు పెంచామన్నారు. అర్హులైన అందరికీ ఆరు గ్యారెంటీలు అందుతాయన్నారు.

## ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు




**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఓటాన్ అకౌండ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తం 2,75,891 కోట్లుతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆరు గ్యారంటీల అమలకు భారీగా నిధులు కేటాయించింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం, ఆసరా కింద ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే. రూ. 500కే గ్యాస్ సిలండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలకు తాజాగా ప్రభుత్వం రెడీ అయింది. అందులో భాగంగా బడ్జెట్‌లో ఆయా రంగాలకు పెద్ద పీఠ వేశారు. ఆరు గ్యారంటీల అమలకు బడ్జెట్‌లో 20 శాతానికి పైగా అంటే 53,196 కోట్ల నిధులు కేటాయించారు. గృహజ్యోతి పథకం 200 యూనిట్లలోపు ఉచిత పథకం కోసం 2,418 కోట్లు కేటాయించారు. విద్యుత్ రంగానికి మొత్తంగా 16,825 కోట్ల కేటాయింపులు చేశారు. వైద్య, ఆరోగ్య రంగానికి 11,500 కోట్లు కేటాయించారు.పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గృహ నిర్మాణానికి 7,740 కోట్లు కేటాయించారు. పరిశ్రమల శాఖకు 2,543 కోట్లు, ఐటి శాఖకు 774 కోట్లు, పంచాయతీ రాజ్ 40,080 కోట్లు, పురపాలక శాఖకు 11,692 కోట్లు, మూసీ రివర్ ఫ్రాంట్ 1000 కోట్లు, ఎస్సీ సంక్షేమం 21,874 కోట్లు, ఎస్టీ సంక్షేమం 13,013 కోట్లు, నీటి పారుదల శాఖకు 28,024 కోట్లు కేటాయించారు.

## తెలంగాణలో ఫిబ్రవరి 15న సెలవు



**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 15న ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటించారు. వచ్చే జయంతి నాటికి రాజధాని హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణలోని అన్ని వర్గాల అభ్యున్నతి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ముఖ్యంగా గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ రాముల్ నాయక్ కోరగా.. కోమటిరెడ్డి స్పందించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 1739 ఫిబ్రవరి 15న, అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని గొల్లలదొడ్డి దగ్గరున్న సేవాగఢ్‌లో జన్మించారన్నది బంజారాల విశ్వాసం. ఆయన గొప్ప సంఘ సంస్కరణవాది. ఆధ్యాత్మిక గురువు. జగదంబకు అత్యంత ప్రియ భక్తుడు. బ్రహ్మచారి అయిన సేవాలాల్.. విశిష్ట బోధనలతో యశస్సును పొందారు. ఆయన్ను చాలా మంది భక్తులు అనుసరించేవారు. బంజారాల హక్కులు, నిజామ్, మైసూరు పాలకుల దాష్టీకాలకు వ్యతిరేకంగా.. 18వ శతాబ్దంలో సాగిన పోరాటంలో సంత్ సేవాలాల్ కీలక భూమిక పోషించారు.ఆంగ్లేయులు, ముస్లిం పాలకుల ప్రభావాలకులోను కాకుండా, ఇతర సంప్రదాయాల్లోకి బంజారాలు మారకుండా సేవాలాల్ ఎంతగానో కృషి చేసినట్లు చెబుతారు. తద్వారా బంజారాలకు ఆయన ఆరాధ్య దైవమయ్యాడు. లిపిలేని బంజారాల భాషకు ఒక రీతిని సమకూర్చింది కూడా సేవాలాల్ మహారాజే. కోట్లాదిగా బంజారాలు... స్థిర నివాసం లేకున్నా తమ కట్టుబాట్లు , ఆచారవ్యవహారాలు, విలక్షణమైన దుస్తులు, ఆభరణాలతో బంజారాలు తమ ప్రత్యేకతను నిలుపుకుంటూ.. ఒకేరకమైన భాషను మాట్లాడగలుగుతున్నారంటే అది సంత్ సేవాలాల్ కృషి ఫలితమే. దాంతో ఆయన్ను బంజారాలు ఆరాధ్యదైవంగా భావించి ఆయన జయంతిని ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు.

## ఆ ఎమ్మెల్యేలకు ఏపీ అసెంబ్లీ స్పీకర్ నోటీసులు



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత పిటిషన్ల వ్యవహారంలో.. వైఎస్సార్‌సీపీ రెబల్ ఎమ్మెల్యేలకు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న విచారణకు హాజరు కావాలని మరోసారి నోటీసులు పంపారు. ఈసారి వాళ్ల నుంచి పూర్తిస్థాయి వివరణ తీసుకున్నాకే నిర్ణయం ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 8వ తేదీన జరిగిన విచారణకు హాజరు కాని వైఎస్సార్‌సీపీ రెబెల్ ఎమ్మెల్యేలకు మరో అవకాశం ఇచ్చారు. రెబెల్ ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఈ నెల 12వ తేదీన విచారణకు వెళతారా లేదా అన్నది చూడాలి.అనర్హత నోటీసుపై స్పీకర్ తమ్మినేని సీతారాంను వైసీపీ రెబెల్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఈ నెల 8న కలిశారు. స్పీకర్‌తో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావడం రెండోసారి అని చెప్పుకొచ్చారు.మొదటి సారి హాజరైనప్పుడు చాలా వివరాలు అడిగారనీ.. అవన్నీ తాను చెప్పానన్నారు. దానికి సంబంధించిన పేపర్లను కూడా ఇచ్చినట్లు వెల్లడించారు. అనర్హత నోటీసుపై స్పీకర్‌కు 5వ తేదీన తమ దగ్గర ఉన్న పత్రాలను ఇచ్చామని అన్నారు. మీడియాలో ప్రచురించిన వాటిని చీఫ్ విప్ ప్రసాదరాజు ఇచ్చారని..వేరే మేనేజ్మెంట్‌కు సంబంధించినవి ఆయనెలా ఆథరైజ్ చేస్తారో చెప్పాలన్నారు. ఆరోపించిన ప్రసాదరాజు ఆథరైజ్ చేస్తే వాటికి విలువ ఉండదని అన్నారు. పెట్టిన సాక్ష్యాధారాలు ఏపీ ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం విలువైనవి కావని ఆరోపించారు. ఇవి తీసుకుని మీరెలా చేస్తారని స్పీకర్ ను అడిగినట్లు ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు.

## మిథున్ చక్రవర్తికి గుండెపోటు



**తెలంగాణ వీణ , సినిమా :** బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ప్రస్తుతం గుండెపోటుతో ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. కలకత్తాలోని అపోలో ఆస్పత్రిలో ఆయన్ను చేర్పించినట్టుగా సమాచారం అందుతోంది. మిథున్ చక్రవర్తికి కేంద్రం ఇటీవలే పద్మ భూషణ్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగులోనూ మిథున్ చక్రవర్తి తన నటనతో అభిమానుల్ని సంపాదించుకున్నారు. గోపాల గోపాల చిత్రంలో స్వామిజీగా కనిపించి తన దైన శైలిలో నటించి మెప్పించిన సంగతి తెలిసిందే.బెంగాలీ, హిందీ, తెలుగు ఇలా చాలా భాషల్లో మిథున్ చక్రవర్తి చెరగని ముద్ర వేసుకున్నారు. మరీ ముఖ్యంగా 80, 90వ దశకంలో మిథున్ చక్రవర్తి ఎవరెస్ట్ అంత క్రేజ్ ఉండేది. ఆయన వేసే ప్రత్యేకమైన స్టెప్పులకు అప్పట్లో భారీ అభిమాన గణమే ఉండేది. ఆయన కాశ్మీరీ ఫైల్స్ సినిమాలోనూ నటించిన సంగతి తెలిసిందే. ఈ మధ్య ఆయన అనారోగ్యం కారణంగా సినిమాల్లో ఎక్కువగా నటించడం లేదు. రాజకీయంగానూ ఆయన అంత యాక్టివ్‌గా ఉండటం లేదు.గతంలో ఆయన రాజ్యసభ సభ్యుడిగానూ పని చేశారు. టీఎంసీ నుంచి బీజేపీలోకి వచ్చారు. ఇక ఇప్పుడు ఆయన్ను పద్మ భూషణ్‌తో కేంద్రం సత్కరించిన సంగతి తెలిసిందే. మిథున్ చక్రవర్తి ఆరోగ్యానికి సంబంధించిన బుల్లిటెన్ గానీ అధికారిక ప్రకటన గానీ ఇంత వరకు ఎటువంటిది రాలేదు.

## మార్చి 4న తెలంగాణ ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** తెలంగాణలో రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఎడ్‌సెట్ 2024కు సంబంధించిన ప్రకటన వెలువడింది. తాజా ప్రకటన ప్రకారం.. మార్చి 4వ తేదీన ఎడ్‌సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. అనంతరం మార్చి 6వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. తర్వాత మే 23వ తేదీన ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు పూర్తి వివరాలను https://edcet.tsche.ac.in/ వెబ్‌సైట్‌లో చెక్ చేసుకుంటూ ఉండాలి.

